సాక్షి జనగామ

ఆదివారం | 8 | డిసెంబర్ | 2024



కేఎంటీపీ అభివృద్ధికి కృషి

వరంగల్ జిల్లాలోని కేఎంటీపీ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు.

- 8లో▸



ఆదినుంచి వివాదాస్పదుడే..

అంబులెన్స్ వాహనాన్ని అపహరించి పట్టుబడిన వెంకట్రాంనర్సయ్య ఆదినుంచి వివాదాస్పద వ్యక్తిగానే కొనసాగుతున్నాడు.

- 8లో▸

గరిష్టం/కనిష్టం
$29^0/21^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం మంచు ఎక్కువగా కురుస్తుంది. మధ్యాహ్నం ఆహ్లాదకర వాతావరణం, రాత్రి చల్లగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

లోక్ అదాలత్‌పై అవగాహన కల్పించాలి



జనగామ రూరల్: ఈనెల 12, 14, 24న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో కక్షిదారులు ఎక్కువ మంది పాల్గొనేలా అధికారులు అవగాహన కల్పించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి రవీంద్ర శర్మ అన్నారు. శనివారం డీసీపీ రాజమహేంద్ర నాయక్, ఏసీపీ పార్థసారథి, అడ్వకేట్స్, బ్యాంక్ మేనేజర్లు, బీఎస్ఎన్ఎల్ వారితో వేర్వేరుగా సమావేశం నిర్వహించారు. ఈకార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎలగందుల చంద్ర ఋషి, సీనియర్ సివిల్ జెడ్జి విక్రమ్, సుచరిత పాల్గొన్నారు.

సమయ పాలన పాటించాలి



చిల్పూరు: అధికారులు, సిబ్బంది సమయ పాలన పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని అప్పుడే వారికి ప్రభుత్వ పథకాలు అందుతాయని జెడ్పీ సీఈఓ మాధురిషా అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయాన్ని ఆమె శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. అనంతరం డబుల్ బెడ్రూం ఇళ్ల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం జెడ్పీ సీఈఓను సన్మానించారు. ఎంపీడీఓ శంకర్ నాయక్, ఎంపీఓ మధుసూదన్, కృష్ణ, సెక్రటరీలు స్నేహ, నవనీత, పన్నీరు మధు, అజీజ్ పాషా, విమల, రాజు, బాపునాయక్, పిట్ట బాబు, హరిప్రసాద్, తిరుమలరెడ్డి, రాం బాబు, శశికుమార్ తదితరులు పాల్గొన్నారు.

11న డేటా ఎంట్రీ ఆపరేటర్ అర్హత పరీక్ష

జనగామ: జనగామ మెడికల్ కళాశాలలో ఏడు ఔట్ సోర్సింగ్ డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టులకు ఈనెల 11వ తేదీన కలెక్టర్ కార్యాలయంలో కంప్యూటర్ ఆధారిత అర్హత పరీక్ష నిర్వహించనున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గోపాలరావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డేటా ఎంట్రీ ఆపరేటర్ల కోసం దరఖాస్తు చేసుకోగా 268 మంది అర్హత సాధించారని ఇందుకు సంబంధించిన సమాచారం వైద్య కళాశాల వెబ్‌సైట్ https://gmcjangaon.org/download లో అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు. అభ్యర్థులు అప్లికేషన్, రశీదు, ఒరిజినల్ ఆధార్ కార్డుతో కలెక్టరేట్‌లో రిపోర్ట్ చేయాలని సూచించారు. మూడు బ్యాచ్‌లుగా అర్హత పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. అభ్యర్థులకు ఫోన్, ఎస్ఎంఎస్ ద్వారా సమాచారం పంపించినట్లు తెలిపారు.

వర్గీకరణ సాధిస్తాం..



జనగామ రూరల్: సీఎం రేవంత్ రెడ్డి వెంట మాదిగ సమాజం నడిచి ఏబీసీడీ వర్గీకరణ సాధిస్తుందని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి అన్నారు. శనివారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మాదిగల చిరకాల స్వప్నమైన ఎస్సీ వర్గీకరణ, 12 శాతం రిజర్వేషన్ సాధించాలంటే మాదిగలు సంఘాలను పక్కనపెట్టి సీఎం రేవంత్ రెడ్డి వెంట నడవాలని పిలుపునిచ్చారు. రేవంత్ రెడ్డి మొదటి నుంచి మాదిగల పక్షపాతి అని అన్నారు. మాదిగలు అత్యధికంగా ఉన్న జిల్లాల్లో వర్గీకరణ జిల్లాల వారీగా చేయాలన్నారు. ఎంహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మైసా ఉపేందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఇరుగు సుధాకర్, గణేశ్, జితేందర్, నాగరాజు పాల్గొన్నారు.


దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణించాలి

జనగామ రూరల్: దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణించాలని జిల్లా సమ్మిళిత విద్య కోఆర్డినేటర్ బోనగిరి నరసింహారావు, ఎంఈఓ రాజేందర్ అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా శనివారం పట్టణంలో భవిత కేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం అందజేస్తున్న ఉపకరణాలు, స్కాలర్‌షిప్‌ల గురించి వివరించారు. దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లాలని సూచించారు. ఈ సందర్భంగా దివ్యాంగులకు నిర్వహించిన ఆటలపోటీల్లో గెలుపొందినవారికి బహుమతులు అందజేశారు. ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ ప్రసాద్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శంకర్ రెడ్డి, భవిత సెంటర్ నిర్వాహకులు నీరజ, శోభ కేర్ టేకర్ నర్మద పాల్గొన్నారు.



రాయపర్తి బ్యాంకులో కట్ చేసిన లాకర్ (ఫైల్)

అది ఉత్తరప్రదేశ్ బదౌన్ జిల్లాలోని ఓ ఆమ్లెట్ గ్రామం. పేరు కక్రలా. ఇక్కడ 63 ఇళ్లున్నాయి. 300 జనాభా ఉంటుంది. వీరిలో సగానికిపైగా గ్యాస్ వెల్డింగ్ పనిమీదే జీవనం సాగిస్తుంటారు. ఆ పనిలో వీరంతా సిద్ధహస్తులు. ఇప్పుడు ఇదంతా ఎందుకు చెబుతున్నారని అనుకుంటున్నారా? ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన వరంగల్ జిల్లా రాయపర్తి ఎస్‌బీఐ చోరీ కేసులో సూత్రధారులు, పాత్రధారులు ఇక్కడివారే. రాష్ట్ర వ్యాప్తంగా పలు చోరీ కేసుల్లో తప్పించుకుతిరుగుతున్న వీరు.. ఇప్పటికీ పోలీసులకు ముచ్చెమటలు పట్టిస్తున్నారు.



వరంగల్ ఖాకీలకు కక్రలా కలవరం

రాయపర్తి ఎస్‌బీఐ బంగారం చోరీలో ఈగ్రామవాసులే కీలకం

'ఖాకీ' సినిమా తరహాలో..

ఖాకీ సినిమాలో దోపిడీ దొంగలను పట్టుకునేందుకు వెళ్లిన పోలీస్ బృందంపై ఆ గ్రామస్తులు మూకుమ్మడిగా దాడి చేస్తారు. వారినుంచి పోలీసులు చాకచక్యంగా తప్పించుకుంటారు. అదే తరహాలో ఈ కక్రలా గ్రామంలోనూ కనిపిస్తుంటుంది. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో బ్యాంకు లాకర్ల నుంచి 13 కిలోలు దొంగతనం చేసిన కేసులో 2023 జూన్ 30వ తేదీన కక్రలా గ్రామానికి చెందిన అయాజ్, ఆలీ నయీమ్, యూసఫ్ ఖాన్‌ను పట్టుకునేందుకు వెళ్లిన పోలీసులపై అక్కడి గ్రామస్తులు సంఘటితమై దాడికి దిగారు. ఒకానొక దశలో ఆ ముగ్గురు నిందితులు కాల్పులు జరపడంతో చాకచక్యంగా వ్యవహరించిన పోలీసులు వారిని పట్టుకోగలిగారు. ఇలా.. చాలా కేసుల్లో అక్కడికెళ్లిన పోలీసులకు బ్యాంకు దొంగలను పట్టుకోవాలంటే ముచ్చెమటలు పట్టాల్సిన పరిస్థితి ఉంది. కొన్ని సందర్భాల్లో పోలీసుల ప్రాణానికి కూడా ప్రమాదం ఏర్పడే అవకాశం లేకపోలేదు.



రికవరీ బంగారాన్ని చూపుతున్న సీపీ (ఫైల్)

ఈపల్లెలో సగానికిపైగా కుటుంబాలు గ్యాస్ వెల్డింగ్‌లో సిద్ధహస్తులు

- పెద్దగా చదువుకోకపోయినా దేశవ్యాప్తంగా సంచలన చోరీ కేసుల్లో వీరే కీలకం
- వివిధ రాష్ట్రాల్లోని పలు బ్యాంకుల్లో దోపిడీ.. బంగారంపైనే కన్ను
- అన్నదమ్ములిద్దరినీ పట్టుకుంటేనే భారీ రికవరీ సాధ్యం

SAKSHI EXCLUSIVE

సాక్షి, వరంగల్:

వరంగల్ పోలీసులకు ఉత్తరప్రదేశ్‌లోని బదౌన్ జిల్లా కక్రలా గ్రామం సవాల్ విసురుతోంది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) రాయపర్తి బ్రాంచ్‌లో గత నెల 18న అర్ధరాత్రి దాటిన తర్వాత జరిగిన 19 కిలోల బంగారం చోరీ కేసులో ఈ గ్రామానికి చెందిన అన్నదమ్ములు మహమ్మద్ నవాబ్ హసన్, సాజిద్ ఖాన్ కీలక సూత్రధారులు. గ్యాస్ వెల్డింగ్ పనిచేయడంలో అపార ప్రావీణ్యమున్న వీరిలో ఒకడైన సాజిద్ ఖాన్ 2015లో తమిళనాడు కృష్ణగిరి జిల్లా గురుబరపల్లి గ్రామంలోని జాతీయ బ్యాంక్ నుంచి 48 కిలోల బంగారం చోరీ ఘటనలో ప్రధాన నిందితుడు. వీరే కాదు ఈగ్రామంలో 63 ఇళ్ల ఉంటే దాదాపు సగానికిపైగా కుటుంబాలు గ్యాస్ వెల్డింగ్‌లో సిద్ధహస్తులు. నిమిషాల వ్యవధిలోనే గ్యాస్ కట్టర్ సహకారంతో స్టీల్ గ్రిల్స్‌ను కట్ చేస్తారు. ఏటీఎం, బ్యాంకు దొంగతనాల్లో వీరిది అందెవేసిన చెయ్యి. పదో తరగతి వరకు కూడా చదువుకోని వీళ్లు పదేళ్లుగా బ్యాంకు దొంగతనాలు, ఏటీఎం చోరీల్లో ప్రావీణ్యం చూపుతున్నారు. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో పంజా విసురుతూ పోలీసులకే చుక్కలు చూపిస్తున్నారు.



లాకర్ కటింగ్‌కు నిందితులు వాడిన గ్యాస్ (ఫైల్)

బంగారం స్వాధీనం కష్టమేనా?

రాయపర్తి ఎస్‌బీఐ చోరీ కేసులో కీలకంగా వ్యవహరించిన అన్నదమ్ములు మహమ్మద్ నవాబ్ హసన్, సాజిద్ ఖాన్‌ను పట్టుకునేందుకు వరంగల్ పోలీసులు బృందాలుగా వెళ్లారు. వీరి స్వగ్రామమైన కక్రలాకు కూడా మూడు బృందాలు వెళ్లాయి. మఫ్టీలో వెళ్లిన పోలీసులకు అక్కడి స్థానికులనుంచి సహకారం లేకపోవడంతో వారిని పట్టుకోవడం కష్టతరమవుతోంది. పోలీసుల కదలికలు ఉన్నాయని తెలుసుకున్న వారు తమ గ్రామస్తులను రక్షణ కవచంలా వాడుకుంటున్నారు. అందుకే పోలీసులు చాలా అప్రమత్తంగా వ్యవహరిస్తూ వారిని పట్టుకునేందుకు శతవిధాలా ప్రయత్నిస్తున్నారు. వీరిద్దరూ దొరికితేనే పదహారున్నర కిలోల బంగారం రికవరీ అయ్యే అవకాశముంది. ఇప్పటికే ఈ కేసులో ఉత్తరప్రదేశ్ బుదాన్ తాలుకా షేహవాజ్‌పూర్‌కు చెందిన అర్షాద్ అన్సారీ, షాకీర్‌ఖాన్ ఆలియాస్ బోలెఖాన్, మహారాష్ట్ర బుల్దనా జిల్లా మోటల గ్రామవాసి హిమాన్షు బిగాం చండ్ జాన్వర్‌ను అరెస్ట్ చేశారు. వీరినుంచి రెండు కిలోల 520 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్న సంగతి తెలిసిందే. ఇక.. పరారీలో ఉన్న యూపీలోని బదౌన్ జిల్లా కక్రలా గ్రామానికి చెందిన మహమ్మద్ నవాబ్ హసన్, సాజిద్ ఖాన్, మహారాష్ట్ర చికిల్లి తాలుకా సైగావ్ గ్రామవాసి అక్షయ్ గజానన్ అంబోర్, బుల్దానా జిల్లా పునై మోటాల గ్రామం సాగర్ భాస్కర్ గోర్‌ల గురించి ప్రత్యేక బృందాలు గాలిస్తున్నట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా వెల్లడించారు.

ప్రతిభని గుర్తించేందుకే క్రీడా పోటీలు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా



కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

- కలెక్టర్ రిజ్వాన్ బాషా
- సీఎం కప్ క్రీడలు ప్రారంభం

జనగామ రూరల్: గ్రామీణ స్థాయి క్రీడాకారులల్లో ఉండే ప్రతిభని గుర్తించి ప్రోత్సాహం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సీఎం కప్ క్రీడాపోటీలను నిర్వహిస్తుందని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. శనివారం ధర్మకంచ మినీ స్టేడియంలో ఈ పోటీలను కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సీఎం కప్ పోటీల్లో నిర్వహించే అన్ని క్రీడల్లో జిల్లా క్రీడాకారులు పాల్గొని తమ ప్రతిభను చూపించి రాష్ట్ర స్థాయికి చేరుకోవాలన్నారు. రాష్ట్ర స్థాయిలో జిల్లాకి గుర్తింపు తీసుకరావాలన్నారు. క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని వసతులు కల్పించాలని, మెడికల్ సిబ్బంది అందుబాటులో ఉండాలని తెలిపారు. శనివారం, ఆదివారం గ్రామ పంచాయతీల్లో, 10 నుంచి 12వ తేదీల్లో మండలాల్లో, 7 నుంచి 9 మున్సిపాలిటీల్లో, 16 నుంచి 21వ తేదీల్లో జిల్లా స్థాయిలో, 27 నుంచి జనవరి 2 వరకు రాష్ట్ర స్థాయిలో రన్నింగ్, లాంగ్ జంప్, యోగా, ఫుట్ బాల్, బాడ్మింటన్, బాక్సింగ్, బాస్కెట్ బాల్, ఖోఖో కబడ్డీ, స్విమ్మింగ్, చెస్, జూడో మొదలగు క్రీడలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్రీడాకారులకు ఇది మంచి అవకాశమన్నారు. పోటీల్లో పాల్గొనే ప్రతీ ఒక్కరికీ సర్టిఫికెట్ ఇవ్వాలని విద్యార్థులకు ఈ సర్టిఫికెట్ ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జమున, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, యుజన, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాడిపరిశ్రమను పెంపొందించుకోవాలి

- జిల్లా పశువైద్యాధికారి రాధాకిషన్

స్టేషన్‌ఘన్‌పూర్: రైతులు వ్యవసాయానికి అనుబంధంగా పాడిపరిశ్రమను పెంపొందించుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని జిల్లా పశువైద్యాధికారి రాధాకిషన్ అన్నారు. మండలంలోని రాఘవాపూర్ గ్రామంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో శనివారం పశువుల గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం, మేలుజాతి దూడల ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన రాధాకిషన్ మాట్లాడారు. పాడిరైతులు.. పశువైద్యాధికారుల సలహాలు, సూచనలు పాటించాలని, మేలు జాతి పశు సంతతి ద్వారా అధిక పాల దిగుబడితో వస్తుందన్నారు. జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యనిర్వాహణ అధికారి డాక్టర్ రఘుబాబు మాట్లాడుతూ.. కేవలం ఆడదూడలు పుట్టే లింగ నిర్ధారణ సెక్స్ సార్టెడ్ సెమెన్ అందుబాటులో ఉందని, పాడిరైతులు వినియోగించుకోవాలని సూచించారు. శిబిరానికి మొత్తం 56 పశువులను తీసుకురాగా.. పశువైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా నట్టల నివారణ, కాల్షియం లవణ మిశ్రమాలు తదితర మందులను పంపిణీ చేశారు. కాగా గ్రామానికి చెందిన ముగ్గురు ఉత్తమ పాడి రైతులకు ప్రోత్సాహక బహుమతులను అందించారు. పశువైద్యాధికారి మౌనిక, పీవీసీ డాక్టర్ అనేష్, ఏరియా గోపాలమిత్ర సూపర్‌వైజర్ రాజేశ్వర రావు, గోపాలమిత్రలు రాజేష్, అయాస్, రమణా చారి, భిక్షపతి, రాజు, రజాక్, అనీల్ పాల్గొన్నారు.



మందులు పంపిణీ చేస్తున్న రాధాకిషన్

అధిక సాంద్రత పత్తితో ఎక్కువ దిగుబడి

దేవరుప్పుల : మండలంలోని మాధాపురంలో ప్రొఫెసర్ జయంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఏరువాక కేంద్రం, యాదాద్రి భువనగిరి జిల్లా వారి ఆధ్వర్యంలో కేంద్రియ పత్తి పరిశోధన సంస్థ ప్రాజెక్టులో భాగంగా అధిక సాంద్రత పత్తి సాగుపై శనివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ అనిల్‌కుమార్ మాట్లాడుతూ.. అధిక సాంద్రత పత్తి సాగు విధానం, ప్రాజెక్టు వివరాలను రైతులకు తెలియజేస్తూ జిల్లా వ్యాప్తంగా సాగు విస్తరింపజేయాలని సూచించారు. మన రాష్ట్రంలోని 10 జిల్లాల్లో ఈ ప్రాజెక్ట్ అమలులో ఉందని తెలిపారు. అధిక సాంద్రత పత్తి సాగులో మొక్కల మధ్య, వరుసల మధ్య దూరం తగ్గించి ఎకరాకు ఎక్కువ మొక్కలు వచ్చేలా విత్తుకోవాలన్నారు. అధిక సాంద్రత పత్తి సాగులో ఎకరానికి 25 వేల నుంచి 35 వేల వరకు మొక్కల సంఖ్యను పాటిస్తూ వర్షాధారంగా ఎకరానికి 9-13 క్వింటాళ్ల దిగుబడిని పొందవచ్చన్నారు. ఈ పద్ధతిలో సాగు చేస్తున్న రైతులకు కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహకంగా ఎకరానికి రూ.5 వేలు వారి ఖాతాలో జమ చేస్తుందన్నారు. ఈ పథకంలో చేరుటకు చిన్న, సన్నకారు రైతులు అర్హులని తెలిపారు. శాస్త్రవేత్త మమత మాట్లాడుతూ.. అధిక సాంద్రత పత్తి సాగుకు వర్షాధార తేలిక నేలలు, భూసారం తక్కువగా ఉండే చల్క నేలలు అనుకూలమన్నారు. అధిక సాంద్రత పద్ధతిలో ఒకేసారి పూత, కాయలు రావడం వలన, పంట తొందరగా (నవంబర్/డిసెంబర్ లో) చేతికి వస్తుందన్నారు. శాస్త్రవేత్త మధుశేఖర్, వ్యవసాయ అధికారి బజ్జూరి దివ్య, ఏఈఓ సంతోష్, రాశి, అంకుర్ విత్తన కంపెనీ ప్రతినిధులు, రాజి రెడ్డి, సందీప్, దేశ్‌పాండే ఫౌండేషన్ ప్రతినిధి నరేశ్, యంగ్ ప్రొఫెషనల్స్ వేణు, రూప, విజయకాంత్ రైతులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త అనిల్‌కుమార్

సైన్స్ పండుగకు వేళాయె..

9, 10 తేదీల్లో జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్

- ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు



జనగామ రూరల్: విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీసేందుకు సైన్స్ ఎగ్జిబిషన్లు ఎంతగానో దోహదపడుతాయి. విద్యార్థుల ప్రతిభకు నాంది పలుకుతాయి. సైన్స్‌పై ఇష్టం పంచుకునేలా భవిష్యత్‌లో విద్యార్థులు శాస్త్రవేత్తలుగా పరిశోధన వైపు ఆసక్తి పెంపొందించుతాయి. ఈనెల 9, 10 తేదీల్లో జిల్లాస్థాయి సైన్స్ (వైజ్ఞానిక ప్రదర్శన) ఎగ్జిబిషన్‌ను నిర్వహించనున్నారు. ఈమేరకు డీఈఓ రమేశ్, సైన్స్ అధికారి ఉపేందర్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. జిల్లాకేంద్రంలోని నెహ్రూపార్క్ వద్ద సెయింట్ పాల్స్ హైస్కూల్లో నిర్వహించే ఈ ఎగ్జిబిషన్‌కు జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, కేజీబీవీ, మోడల్, గురుకులాలు, ప్రైవేట్ పాఠశాలల నుంచి ఎగ్జిబిట్లను ప్రదర్శించాలని డీఈఓ ఆదేశాలు జారీచేశారు. సుమారు 252 ఎగ్జిబిట్లను ప్రదర్శించే అవకాశం ఉంది. జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రదర్శన కనబర్చిన 14 నమూనాలను రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తారు.

ఉపాధ్యాయుల పర్యవేక్షణలో..

ఎగ్జిబిట్ల ప్రదర్శనకు ఆయా పాఠశాలల ఉపాధ్యాయుల పర్యవేక్షణలో ఏర్పాట్లు చేసుకున్నారు. 8, 9, 10వ తరగతులను సీనియర్ విభాగంగా.. 6, 7 తరగతులను జూనియర్ విభాగంగా ఎంపిక చేశారు. ప్రతీ పాఠశాల నుంచి ఒక్కో అంశానికి ఒక ఎగ్జిబిట్ చొప్పున గరిష్టంగా జూనియర్, సీనియర్ విభాగాలను కలుపుకొని రెండు ఎగ్జిబిట్లను ప్రదర్శించవచ్చు. సబ్జెక్టును బోధించే ఉపాధ్యాయుడు ఒక టీఎల్ఎం ప్రదర్శించడానికి అవకాశం ఉంటుంది. ప్రాజెక్టుకు ఒక విద్యార్థి, ఒక గైడ్ ఉంటారు. బీఈడీ, డీఈడీ చేస్తున్న ఛాత్రోపాధ్యాయులు బోధనోపకరణాలను ప్రదర్శించే అవకాశం ఉంటుంది. వీటినుంచి రెండింటిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేయనున్నారు.



అధికారులకు సూచనలిస్తున్న డీఈఓ రమేశ్

సన్నాహక సమావేశం

జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన విజయవంతం కోసం శనివారం జిల్లా కేంద్రంలోని సెయింట్ పాల్స్ హైస్కూల్లో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ రమేశ్ మాట్లాడారు. ఆయా కమిటీల కన్వీనర్లు, కో కన్వీనర్లు, సభ్యులు సకాలంలో హాజరై జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనను విజయవంతం చేయాలన్నారు. జిల్లాను రాష్ట్రస్థాయిలో ముందంజలో నిలిపేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. ప్రదర్శనను తిలకించడానికి వచ్చే విద్యార్థులకు సదుపాయాలు కల్పించాలన్నారు.

సైన్స్‌పై ఆసక్తి పెరుగుతుంది..

విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయడంలో సైన్స్ ఎగ్జిబిషన్ ఉపయోగపడుతుంది. ఈ ఎగ్జిబిషన్ సైన్స్‌పై ఆసక్తిని పెంపొందిస్తుంది. నిత్యజీవితంలో మనిషికి ఎదురయ్యే సమస్యలకు పరిష్కారాలను కనుగొనేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయి.



- చింతల ఉపేందర్, జిల్లా సైన్స్ అధికారి

నూతన ఆవిష్కరణలకు అవకాశం

సైన్స్ ఎగ్జిబిషన్ ఎన్నో కొత్త ఆవిష్కరణలు వెలువడుతాయి. సైన్స్ ఎగ్జిబిషన్‌తో విద్యార్థుల్లోని ప్రతిభ వెలికివస్తుంది. ప్రతీ పాఠశాల నుంచి కొత్త అంశాలతో కూడిన ఎగ్జిబిట్లను ప్రదర్శించాలి. ఎగ్జిబిట్ల గురించి సందర్శకులకు చక్కగా వివరించాలి.

- రమేశ్, డీఈఓ

102,108 సేవలు అభినందనీయం



వాహనాలను ప్రారంభిస్తున్న రాజేశ్వర్‌రెడ్డి

నర్మెట: అత్యవసర సమయాల్లో ప్రాణాలను కాపాడుతున్న 102, 108 సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ఆవరణలో శనివారం మండలానికి కేటాయించిన నూతన 102, 108 వాహనాలను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. పలు ప్రమాదాల సమయాలు, ప్రసవ సమయాల్లో గర్భిణులను అత్యవసర వైద్య చికిత్సల నిమిత్తం రోగులను సకాలంలో ఆస్పత్రులకు తరలించడంలో సిబ్బంది శ్రమ వెలకట్టలేనిదని కొనియాడారు. ప్రజలు 108 సేవలను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ నిస్సంగి ప్రసన్న కృష్ణ, డాక్టర్ దేవేంద్ర బాబు, డాక్టర్ ప్రశాంత్ రెడ్డి, కార్యదర్శి కందకట్ల శ్రీధర్, సీహెచ్‌ఓలు జయపాల్‌రెడ్డి, సాంబయ్య, ఎస్‌ఏ ప్రవీన్, హెచ్ఎస్ పద్మావతి, ఫార్మసిస్ట్ అనిల్, మాజీ ఎంపీపీ గోవర్దన్, జెడ్పీ మాజీ కోఆప్షన్ ఎండీ గౌస్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సురేష్, నీరటి సుధాకర్, శివరాజ్, కమలాకర్‌రెడ్డి, జయరాం, విజయప్రతాప్, రామస్వామి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక న్యాయమే ప్రభుత్వ లక్ష్యం



విజయోత్సవ సభలో మాట్లాడుతున్న కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

- డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి
- జిల్లా కేంద్రంలో ప్రజాపాలన విజయోత్సవ సభ
- పాల్గొన్న పీసీసీ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్

జనగామ రూరల్: సామాజిక న్యాయం, అభివృద్ధి లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తుందని డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలో ప్రతాప్‌రెడ్డి అధ్యక్షతన శనివారం ప్రజాపాలన విజయోత్సవ సభను నిర్వహించారు. ముందుగా నెహ్రూ పార్క్ నుంచి జనగామ చౌరస్తాకు కార్యకర్తలు, పార్టీ నాయకులు, మహిళలు బోనాలు బతుకమ్మలతో భారీ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ప్రతాపరెడ్డి మాట్లాడుతూ.. ఎందరో ఆత్మ బలిదానాల పునాదుల మీద తెలంగాణ ఏర్పడిన తర్వాత గడిచిన 10 ఏళ్లలో రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందుతుందనుకుంటే.. కల్వకుంట్ల కుటుంబం గద్దలాగా రాష్ట్ర సంపద దోచుకుందని మండిపడ్డారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తొలి ఏడాదిలో 6 గ్యారంటీలు అమలు చేశామన్నారు. స్థానిక ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి తన విద్యాసంస్థల్లో చదువుతున్న పిల్లలు, తల్లిదండ్రుల పేర్లతో 20వేల దొంగ ఓట్లను ఈ నియోజకవర్గంలో నమోదు చేయించుకుని గెలిచాడని ఆరోపించారు. పీసీసీ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఈ రాష్ట్ర ప్రభుత్వం ఒకవైపు కేసీఆర్ చేసిన అప్పులను కడుతూనే.. ప్రజల అవసరాలను గుర్తించి పథకాలను అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో చెంచారపు శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ రాజమౌళి, లకావత్ లక్ష్మీనారాయణ, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ శివరాజు యాదవ్, గ్రంథాలయ చైర్మన్ రాంబాబు, కాంగ్రెస్ స్టేట్ కోఆర్డినేటర్ పద్మ, జిల్లా అధ్యక్షురాలు ఇందిర, ఎస్సీ సెల్ అధ్యక్షుడు గనిపాక మహేందర్, డీసీసీ వైస్ ప్రెసిడెంట్ గంగం నరసింహారెడ్డి, జనగామ కౌన్సిలర్లు వంగాల కల్యాణి మల్లారెడ్డి, గాదేపాక రామ్‌చందర్, జక్కుల అనిత వేణు, మంత్రి సుమలత శ్రీశైలం, బొట్ల శ్రీను, జనగామ మండల అధ్యక్షుడు లింగాల నర్సిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



పాకాలలో విదేశీ అతిథులు

వరంగల్ జిల్లా నర్సంపేట నియోజకవర్గంలోని పాకాల సరస్సుకు విదేశీ పక్షుల రాక మొదలైంది. వివిధ రకాల పక్షులు సరస్సుపై వాలడంతో పర్యాటకులు చూడడానికి ఇష్ట పడుతున్నారు. లిటిల్ కార్మోరెంట్ మైక్రోకార్బో నైగర్, ఇండియన్ పాండ్ హెరాన్ ఆర్డియోలా గ్రేయి, ఐబిస్ ప్లెగాడిస్ ఫాల్సినెల్లస్ తదితర జాతుల పక్షులు కనువిందు చేస్తున్నాయి. కాలుష్య రహిత సరస్సుగా దేశంలోనే ప్రత్యేక గుర్తింపు పొందిన పాకాల చుట్టూ దట్టమైన అటవీ ప్రాంతం ఉంది. పచ్చని చెట్లు విదేశీ పక్షుల విడిదికి నిలయం అయ్యాయి. ప్రతీ ఏడాది నవంబర్ నుంచి ఫిబ్రవరి వరకు విదేశీ పక్షుల రాకతో పాకాల సరస్సు ఆహ్లాదాన్ని పంచుతోంది. పాకాల అభయారణ్యంలో ఎత్తయిన చెట్లు ఉండడంతో పాటు సరస్సులోని నీరు స్వచ్ఛంగా ఉండడంతో ఈ ప్రాంతానికి విదేశీ పక్షులు రావడానికి కారణం అవుతుంది.

- నర్సంపేట











అరుణాచలానికి ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సు

కాజీపేట అర్బన్ : తమిళనాడులోని అరుణాచల గిరి ప్రదక్షిణ దర్శనానికి వెళ్లే భక్తులకు ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సు సర్వీస్ నడుపుతున్నట్లు ఆర్టీసీ వరంగల్ ఆర్ఎం విజయభాను శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 15వ తేదీ పౌర్ణమి సందర్భంగా టీజీఎస్ఆర్టీసీ వరంగల్ డిపో -1 నుంచి అరుణాచల గిరి ప్రదక్షిణకు వెళ్లే భక్తులకు లగ్జరీ బస్సు సర్వీస్ అందుబాటులో ఉంటుందన్నారు. డిసెంబర్ 13వ తేదీన మధ్యాహ్నం 3 గంటలకు హనుమకొండ బస్టాండ్ నుంచి బయలుదేరి, డిసెంబర్ 14వ తేదీన ఉదయం 6 గంటలకు కాణిపాకంలో విఘ్నేశ్వరుడిని దర్శించుకుని, మధ్యాహ్నం ఒంటి గంటకు నెల్లూరులోని మహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకుని సాయంత్రం అరుణాచలానికి చేరుకుంటుందని తెలిపారు. డిసెంబర్ 15వ తేదీన గిరి ప్రదక్షిణ అనంతరం డిసెంబర్ 16వ తేదీన జోగులాంబ అమ్మవారి శక్తిపీఠం దర్శించుకున్న అనంతరం హనుమకొండకు చేరుకుంటుందని వివరించారు. వివరాలకు 9959226056, 9014169807 నంబర్లలో సంప్రదించాలన్నారు. ఆన్‌లైన్‌లో www.tgsrtcbus.in వెబ్‌సైట్‌లో బుక్ చేసుకోవాలన్నారు. టికెట్ పెద్దలకు రూ. 4,500, పిల్లలకు రూ.3వేలు ఉంటుందని పేర్కొన్నారు.

ఏసీ బస్సులపై 10శాతం రాయితీ

కాజీపేట అర్బన్ : టీజీఎస్ఆర్టీసీ ఏసీ బస్సుల టికెట్ చార్జీపై 10 శాతం రాయితీ కల్పిస్తున్నట్లు వరంగల్ ఆర్ఎం డి.విజయభాను శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. లహరి, ఏసీ-స్లీపర్, ఏసీ-సీటర్, రాజధాని బస్సులకు డిసెంబర్ మాసంలో 10 శాతం డిస్కౌంట్ బంపర్ ఆఫర్ ఉందని వెల్లడించారు. ఏసీ బస్సులు అందుబాటులో ఉన్న రూట్లకు ఈ ఆఫర్ వర్తిస్తుందని, వివరాలకు 99592 26056 నంబర్‌లో సంప్రదించాలని ఆర్ఎం పేర్కొన్నారు.

కేఎంటీపీ అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి

- మౌలిక సదుపాయాలు కల్పిస్తాం
- 50 గజాల వారికి 75 గజాలు ఇచ్చి ఇందిరమ్మ ఇళ్లు
- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు
- కేఎంటీపీకి భూములు ఇచ్చిన రైతులకు ఇంటి స్థలాల పంపిణీ



మాట్లాడుతున్న రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, చిత్రంలో వరంగల్ ఎంపీ కావ్య, పరకాల, వర్ధన్నపేట ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, కలెక్టర్ సత్యశారద



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాశ్ రెడ్డి



మహిళలతో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్ బాబు

గీసుకొండ: వరంగల్ జిల్లాలోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు (కేఎంటీపీ) అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని, ఇక్కడ మౌలిక సదుపాయాలు కల్పిస్తామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. శనివారం కేఎంటీపీలోని యంగ్‌వన్, కైటెక్స్ కంపెనీల పనుల పురోగతిపై అధికారులు, కంపెనీ ప్రతినిధులతో సమీక్షించారు. అనంతరం పార్కు పైలాన్ వద్ద ఏర్పాటు చేసిన సభలో భూములు ఇచ్చిన రైతులకు ఇంటి స్థలాల కేటాయింపు కార్యక్రమంలో ముఖ్య అతిథి గా పాల్గొని మాట్లాడారు. పార్కులో డ్రెయినేజీ సమస్య తీర్చడానికి ప్రభుత్వం రూ. 160 కోట్లు మంజూరు చేసిందని, అంతర్గత రోడ్లు, పచ్చదనం పెంపొందించే పనులు చేపడుతామన్నారు. పార్కు కోసం భూములు ఇచ్చిన రైతుల్లో 186 మందికి కేవలం 50 గజాల చొప్పున స్థలం కేటాయించారని, వారికి 75 గజాల భూమిని ఇచ్చి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. ప్రభుత్వం పారదర్శకంగా ఆరు గ్యారంటీలను అమలు చేయడానికి కృషి చేస్తుండగా, ఏడాది పాలనపై ప్రతిపక్షాలు విషప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. కాగా, మంత్రి శ్రీధర్‌బాబు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం గురించి మాట్లాడుతుండగా సమావేశంలో పాల్గొన్న కొందరు మహిళలు స్పందిస్తూ మహాలక్ష్మి పథకంతో ఆటో డ్రైవర్లు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీనికి మంత్రి స్పందిస్తూ వారి సమస్యలు కూడా పరిష్కరిస్తామన్నారు. ఉచిత విద్యుత్ విషయంలోనూ కొందరు మహిళలు తమకు వర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం వరంగల్ ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ కేంద్రంతో సఖ్యతగా ఉంటూ నిధులు రాబట్టడానికి కృషి చేస్తున్నామన్నారు. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ ప్లాట్లు కేటాయించిన ప్రాంతాన్ని టౌన్‌షిప్ తరహాలో డ్రెయినేజీ, తాగునీరు, కరెంట్ సదుపాయాలు కల్పించడానికి టెండర్లను పిలిచారని, ఈ నెల 25న పనులు ప్రారంభిస్తామన్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు.. భూములు ఇచ్చిన ఆరుగురికి ఇంటి పట్టాలు అందించారు. మిగతా రైతులకు అధికారులు డ్రా పద్ధతిలో ఇంటి స్థలాలు కేటాయించారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు, టీజీఐఐసీ చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి, ఎస్ఎఫ్‌సీ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావుల రాజేశ్వర్‌రావు, 'కుడా' చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, కలెక్టర్ సత్యశారద, ఆర్డీఓ పోలెం ఉమాదేవి, తహసీల్దార్లు ఎండీ రియాజుద్దీన్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు. కాగా, గ్రేటర్ వరంగల్ 15వ డివిజన్ గొర్రెకుంట రెవెన్యూ పరిధిలోని హరి హర ఎస్టేట్‌లో రూ. 44 లక్షల మున్సిపల్ నిధులతో నిర్మించిన బ్రాహ్మణ భవనాన్ని మంత్రి శ్రీధర్‌బాబు ప్రారంభించారు. తెలంగాణ అర్చక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గంగు ఉపేంద్రశర్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మేయర్ సుధారాణి, పరకాల, వర్ధన్నపేట, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యేలు ప్రకాశ్‌రెడ్డి, నాగరాజు, రాజేందర్ రెడ్డి, 'కుడా' చైర్మన్ వెంకట్రాంరెడ్డి, కలెక్టర్ సత్యశారద, బల్దియా కమిషనర్ వాకడే పాల్గొన్నారు.

ఆదినుంచి వివాదాస్పదుడే..

- హయత్‌నగర్‌లో 108 వాహనం అపహరించిన మండలవాసి వెంకట్రాంనర్సయ్య
- డయల్ 100కు ఫోన్ చేసి పోలీసులపైనే తప్పుడు ఫిర్యాదులు
- దేవుడి మనిషిగా చెప్పుకుంటూ కాలభైరవుడిగా నామకరణం



లక్ష్మీనర్సింహాపురంలో వెంకట్రాంనర్సయ్య ఇల్లు

బయ్యారం: హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై హయత్‌నగర్‌లో శనివారం 108 వాహనాన్ని అపహరించి పట్టుబడిన మండలంలోని లక్ష్మీనర్సింహాపురం గ్రామానికి చెందిన రావుల వెంకట్రాం నర్సయ్య అలియాస్ కాలభైరవ ఆదినుంచి వివాదాస్పద వ్యక్తిగానే కొనసాగుతున్నాడు. దేవుడి మనిషిగా దేవుడే తనను పంపించాడని, త్వరలో హోంమంత్రిగా నియామకమై బయ్యారం వస్తానని పోలీసులకే ఝలక్ ఇచ్చిన ఘటనలు ఉన్నాయి. అత్యవసర, ఆపద సమయంలో ప్రజలు సాయం కోసం ఉపయోగించుకునే డయల్ 100కు ఫోన్లు చేసి పోలీసులపైనే ఫిర్యాదు చేసిన ఉదాంతాలు సైతం ఉన్నట్లు తెలుస్తోంది.

పది సంవత్సరాలుగా కాలభైరవుడిగా చెప్పుకుంటూ..

గ్రామానికి చెందిన రావుల భిక్షపతి, సుగుణమ్మ దంపతుల కుమారుడు వెంకట్రాం నర్సయ్య పది సంవత్సరాల క్రితం వరకు ఆయుర్వేద మందులు విక్రయించేవాడు. ఆ తరువాత తనకు తానే కాలభైరవుడిగా చెప్పుకుంటూ మతిస్థిమితం లేకుండా వ్యవహరించేవాడని గ్రామస్తులు పేర్కొంటున్నారు. గ్రామంలో పార్క్ చేసిన వాహనాలను చెప్పకుండా తీసుకెళ్లి పెట్రోల్ అయిపోయిన తరువాత అక్కడే వదిలిపెట్టి వచ్చేవాడు. ఇదే సమయంలో మతిస్థిమితం లేకుండా తిరిగేవాడని స్థానికులు తెలుపుతున్నారు.

డయల్ 100కు ఫోన్ చేసి పోలీసులపై ఫిర్యాదులు..

పోలీస్ సేవలకు ఉపయోగించే డయల్ 100కు వెంకట్రాంనర్సయ్య తరుచూ ఫోన్ చేసేవాడని తెలుస్తోంది. తమ గ్రామంలో చోరీలు జరుగుతున్నా పోలీసులు పట్టించుకోవటం లేదని పలుమార్లు ఫోన్ చేయగా చివరకు స్థానిక పోలీసులు అతడికి కౌన్సెలింగ్ ఇచ్చినట్లు సమాచారం. కౌన్సెలింగ్ సమయంలో తాను దేవుని మనిషినని, త్వరలో హోంమంత్రిగా వచ్చి మీకు(పోలీసులకు) బుల్లెట్లు(వాహనం) కొనిస్తానని, అందరూ వాటిని వినియోగించాలని అనేవాడని పోలీస్ వర్గాల ద్వారా తెలిసింది.

చేష్టలు భరించలేక ఇల్లు వదిలివెళ్లిన కుటుంబీకులు..

వెంకట్రాంనర్సయ్యకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. మతిస్థిమితం లేకుండా వ్యవహరిస్తుండడంతో అతడి కుటుంబసభ్యులు బతుకుదెరువు నిమిత్తం హైదరాబాద్‌కు వలస వెళ్లారు. అప్పుడప్పుడు అక్కడికి వెళ్తున్న వెంకట్రాంనర్సయ్య.. 108 వాహనం చోరీ చేసి వార్తల్లో నిలిచాడు.

ముగిసిన అభిజ్ఞాన్ 3.0 వేడుకలు



సాంస్కృతిక ప్రదర్శన ఇస్తున్న విద్యార్థినులు

హసన్‌పర్తి : హసన్‌పర్తి మండలం అన్నాసాగరం శివారులోని ఎస్సార్ యూనివర్సిటీ ప్రాంగణంలో ఉన్న సుమతిరెడ్డి మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో మూడు రోజుల పాటు నిర్వహించిన అభిజ్ఞాన్ 3.0 వేడుకలు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజశ్రీరెడ్డి మాట్లాడుతూ విద్యార్థినులు సైబర్ నేరాలకు గురికాకుండా స్వీయ రక్షణ చేసుకోవాలన్నారు. సైబర్ సెక్యూరిటీ ఇంజనీర్ రూపక్ వోలేటి మాట్లాడుతూ నెట్ వర్క్ సెక్యూరిటీ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమాన్ని పురస్కరించుకుని విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతి కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా విజేతలకు మెమొంటోలు అందజేశారు. కార్యక్రమంలో ప్రోగ్రాం కోఆర్డినేటర్ మూల రాము, డాక్టర్ మహేందర్, డాక్టర్ వాణిశ్రీ,డాక్టర్ సుదర్శన్, ఏఓ వేణుగోపాల్ పాల్గొన్నారు.

రూ.5 లక్షల అప్పివ్వలేదని హత్య

- బ్యాంకు రిటైర్డ్ ఉద్యోగి హత్య కేసులో నిందితుడి అరెస్ట్
- నిందితుడు మాజీ సర్పంచ్, గతంలో ఓ యూట్యూబర్, ఓ ప్రజాప్రతినిధికి పీఏ
- వివరాలు వెల్లడించిన ఏసీపీ నందిరాంనాయక్



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ నందిరాంనాయక్

రామన్నపేట : రెండు నెలల క్రితం జరిగిన పరిచయం కాస్త నిత్యం మద్యం సేవించేంత సన్నిహితంగా మారింది. చివరికి అడిగిన రూ.5 లక్షల అప్పు ఇవ్వలేదన్న కోపంతో ఒంటిపై ఉన్న బంగారం అయినా దోచుకోవాలనే పథకం పన్ని మద్యం మత్తులో దింపి రోకలిబండతో మోది హత్య చేశాడు. వరంగల్ నగరంలో ఈ నెల 2న బ్యాంకు రిటైర్డు ఉద్యోగి రాజమోహన్(62) హత్య కేసు నిందితుడిని పోలీసులు పట్టుకున్నారు. శనివారం ఏసీపీ నందిరాంనాయక్ కేసు వివరాలు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ములుగు జిల్లా మంగపేట మండలం కోమటిపల్లికి చెందిన జక్కుల శ్రీనివాస్.. హనుమకొండలోని రెవెన్యూ కాలనీలో అద్దె నివాసంలో మణిమ్మ అనే మహిళతో సహజీవనం సాగిస్తున్నాడు. రెండు నెలల క్రితం ఓ సెల్‌ఫోన్ దొరకడంతో దానిని అప్పగించే క్రమంలో బ్యాంకు రిటైర్డు ఉద్యోగి రాజమోహన్‌తో పరిచయం ఏర్పడింది. రాజమోహన్ భార్య కరోనా సమయంలో చనిపోవడం, ఇద్దరి కూతుళ్లలో ఒకరు అమెరికాలో, మరొకరు హైదరాబాద్‌లో ఉంటుండగా ఒంటరి జీవనం సాగిస్తున్న అతను.. నిందితుడి శ్రీనివాస్‌తో తన సాదకబాధకాలు చెప్పుకునేంత దగ్గరి చనువు పెరిగింది. తరచూ శ్రీనివాస్, రాజమోహన్ కలిసి మద్యం తాగే వారు. ఈ క్రమంలో శ్రీనివాస్ రూ.5లక్షలు అప్పుగా ఇవ్వాలని రాజమోహన్‌ను అడిగాడు. అందుకు తను సరే చూద్దాంలే.. 'ప్రస్తుతం నా దగ్గర అంత డబ్బు లేదు.. నేను ఇవ్వలేనను' అని చెప్పాడు. స్థానికంగా తనకు ఎవరూ లేరని, రాజమోహన్ ఒంటిపై వేసుకునే లక్షలాది రూపాయల విలువైన బంగారాన్ని ఎలాగైనా దోచుకోవాలనే ఆశతో రాజమోహన్‌ను హత్య చేయాలని నిర్ణయించుకున్నాడు. ఈ నెల 2వ తేదీన శ్రీనివాస్ తాను కిరాయికి ఉంటున్న ఇంటికి రాజమోహన్‌ను పిలిచి ఇద్దరు కలిసి మద్యం తాగారు. ఈ క్రమంలో రోకలిబండతో రాజమోహన్ తలపై తీవ్రంగా కొట్టి చంపాడు. కాళ్లను కుక్క గొలుసుతో, చేతులను దండం తాడుతో.. మెడను తువ్వాలతో కట్టి గోనె సంచిలో మృతదేహాన్ని కారులోకి వెనుక సీటులో వేశాడు. మృతదేహాన్ని నగరంలోని పలు ప్రాంతాలకు తీసుకెళ్లి చివరకు 3వ తేదీ ఉదయం 3.42 గంటల సమయంలో రంగంపేటలో వదిలివెళ్లాడు. అక్కడినుంచి ఆటోలో ఇంటికి వెళ్లిన నిందితుడు ఎలాంటి ఆధారాలు లేకుండా కడిగి వేశాడు. మృతుడికి సంబంధించిన మొబైల్ ఫోన్‌ను సైతం దాచాడు.

సాంకేతిక పరిజ్ఞానంతో గుర్తింపు..

శ్రీనివాస్ గతంలో యూట్యూబ్ చానల్ నిర్వహించాడు. ఓ ప్రజాప్రతినిధి పీఏగా, సర్పంచ్‌గా విధులు నిర్వర్తించాడు. క్రైం పార్టీ పోలీసులతోపాటు నాలుగు ప్రత్యేక బృందాలు ఘటన స్థలంలో లభించిన సీసీ పుటేజీతోపాటు ఫోన్ కాల్ డేటా ఆధారంగా నిందితుడు శ్రీనివాస్‌గా గుర్తించారు. పక్కా ఆధారాలతో నిందితుడిని అదుపులోకి తీసుకుని సెల్‌ఫోన్, బ్రాస్లెట్, చైన్, మూడు ఉంగరాలతోపాటు నాలుగున్నర తులాల బంగారం ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ తెలిపారు. నిందితుడిని పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ తుమ్మ గోపి, ఎస్సైలు నవీన్, సాంబయ్య, విఠల్, లచ్చయ్యతోపాటు క్రైం పార్టీ సిబ్బందిని ఏసీపీ ప్రత్యేకంగా అభినందించారు.

ఆ రోజు ఏం జరిగింది?

- మిస్టరీగా వాజేడు ఎస్సై ఆత్మహత్య
- హరీశ్ బలవన్మరణానికి యువతే కారణమా?
- ఇప్పటి వరకూ వివరాలు వెల్లడించని పోలీసులు

ములుగు : వాజేడు ఎస్సై హరీశ్ ఆత్మహత్యకు గల ప్రధాన కారణాలను పోలీసులు ఇప్పటి వరకూ వెల్లడించలేకపోతున్నారు. ఎస్సై ఆత్మహత్య రోజు ఏమి జరిగిందనే అంశం మిస్టరీగా మారుతోంది. నల్లగొండ జిల్లా చిలుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ తండాకు చెందిన యువతి బ్లాక్ మెయిలింగ్ కారణంగానే ఎస్సై ఆత్మహత్యకు పాల్పడ్డాడనే వార్తలు వెలువడుతున్నాయి. దీంతోపాటు మరేమైన బలమైన కారణాలు ఉన్నాయా అనే కోణంలో పోలీసు యంత్రాంగం రహస్యంగా వివరాలు సేకరిస్తోంది. సదరు యువతి ఈ నెల 1వ తేదీన ఎస్సై హరీశ్ కోసం వచ్చినట్లు ఆధారాలతో పూర్తి సమాచారం ఉంది. ఈ క్రమంలో ఫెరిడోస్ రిసార్ట్‌లోని ఓ గదిలో ఎస్సై ఆత్మహత్య అనంతరం సదరు యువతిని పోలీస్ శాఖతో పాటు ఇతరులు గమనించారు. దీంతో ఎస్సై హరీశ్ ఆత్మహత్య ఘటనలో ఆమె ప్రధాన కారణమా లేక ఇతర విషయాలు ఏమైనా ఉన్నాయా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపడుతున్నారు. హరీశ్ చనిపోక ముందు రోజు యువతితో మాట్లాడే క్రమంలో ఒత్తిడికి లోనై స్నేహితులకు ఫోన్ చేశారు. దీంతో ఓ స్నేహితుడు రిసార్ట్‌కు చేరుకుని యువతితో మాట్లాడి ఆమెను ఒప్పించినట్లు సమాచారం. సమస్య సద్దుమనిగినట్లు భావించిన ఎస్సై హరీశ్ స్నేహితుడిని వెళ్లిపోవాలని సూచించినట్లు తెలిసింది. దీంతో అతను అక్కడి నుంచి బయలుదేరి ములుగు చేరుకున్నాడు. తెల్లవారుజామున 3గంటల ప్రాంతంలో నిద్ర నుంచి లేచిన సదరు యువతి.. ఎస్సైతో గొడవకు దిగినట్లు సమాచారం. దీంతో మరోసారి ఒత్తిడికి లోనైన హరీశ్ ఫోన్ ద్వారా స్నేహితుడిని సంప్రదించాడు. అప్రమత్తమైన స్నేహితుడు ములుగు నుంచి బయలుదేరి వాజేడుకు చేరుకోకముందే ఎస్సై ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిసింది.

ఆ కానిస్టేబుల్ ప్రైవేట్ వెహికిల్ ఎందుకు నడిపారు?

వాజేడు ఎస్సై ఆత్మహత్యకు పాల్పడడానికి ప్రధాన కారణంగా తెలుస్తున్న సదరు యువతి ఈనెల 1వ తేదీ వాజేడు స్టేషన్ ముందు నుంచి ఎస్సై హరీశ్‌కు కాల్ చేసింది. ఈ క్రమంలో ఓ ప్రైవేట్ వెహికిల్ ద్వారా ఆమెను రిసార్ట్‌కు పంపించారు. అయితే ఈ వాహనాన్ని నడిపిన వాజేడు పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ ఎవరు అనే అంశం ఇప్పటికీ తెలియడం లేదు. చివరికి ఆ యువతిని రిసార్ట్‌లో డ్రాప్ చేసిన అనంతరం రెండు, మూడు సార్లు సదరు వ్యక్తి ప్రైవేట్ వాహనంలో కనిపించినట్లు గ్రామస్తులు చెబుతున్నారు.

కలెక్టర్‌పై టీపీసీసీ అధ్యక్షుడికి ఫిర్యాదు

జనగామ రూరల్: జనగామ జిల్లాలో రెండు రోజుల క్రితం మంత్రి కొండా సురేఖ పర్యటించిన నేపథ్యంలో కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా కాంగ్రెస్ ప్రజాప్రతినిధులను వేదికపైకి ఆహ్వానించకుండా అవమానించారని, దీనిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ జనగామ వ్యవసాయ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్ శనివారం టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌కు ఫిర్యాదు చేశారు. ఆర్డీఓ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన షాదీ ముబారక్, కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి కొండా సురేఖ ముఖ్య అతిథిగా హాజరయ్యారన్నారు. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి హాజరై బీఆర్ఎస్ కౌన్సిలర్లను కూడా వేదికపై ఆహ్వానించాలని కోరడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్డీఓ వేదికపైకి ఆహ్వానించారు. అయితే కాంగ్రెస్‌కు చెందిన ఏఎంసీ చైర్మన్, కాంగ్రెస్ కౌన్సిలర్లను వేదిక మీదికి ఆహ్వానించలేదన్నారు. ప్రోటోకాల్ విషయంలో అవమానం జరుగుతోందన్నారు. ఆర్డీఓ కూడా కలెక్టర్ ఆదేశాల మేరకు బీఆర్ఎస్ ఎమ్మెల్యే, కౌన్సిలర్లకు తొత్తుగా వ్యవహరిస్తున్నారన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఒత్తిళ్లకు లొంగి ప్రజాస్వామ్యాన్ని అవమానించిన అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు.

'బంగారు' కృష్ణవేణి

- అంతర్జాతీయ సిట్టింగ్ పారా త్రోబాల్ పోటీల్లో బంగారు పతకం
- 'సాక్షి' కథనంతో దాతల ఆర్థికసాయం
- కృతజ్ఞతలు తెలిపిన క్రీడాకారిణి

స్టేషన్ ఘన్‌పూర్: అంతర్జాతీయ సిట్టింగ్ పారా త్రోబాల్ పోటీల్లో కృష్ణవేణి బంగారు పతకం సొంతం చేసుకుంది. మండలంలోని విశ్వనాథపురం గ్రామానికి చెందిన దివ్యాంగురాలు మాచర్ల కృష్ణవేణి.. ఈనెల 2 నుంచి 5వ తేదీ వరకు కంబోడియా దేశంలో జరిగిన పారాత్రోబాల్ అంతర్జాతీయ పోటీల్లో సత్తా చాటింది. గోల్డ్ మెడల్ కైవసం చేసుకుంది. దీనిపై కుటుంబీకులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. కాగా, నిరుపేద కుటుంబానికి చెందిన కృష్ణవేణి అంతర్జాతీయ పోటీలకు వెళ్లేందుకు ఖర్చులకు చేతిలో చిల్లగవ్వ లేదు. దీంతో దాతల సాయం కోసం వెయ్యి కళ్లతో ఎదురుచూసింది. ఈ తరుణంలో గత నెల 4వ తేదీన 'సాక్షి'లో 'కాళ్లు చచ్చుబడినా.. సడలని సంకల్పం' అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించి దాతల ఆర్థిక చేయూతనందించారు. వారి సహకారంతో కంబోడియా వెళ్లిన కృష్ణవేణి త్రోబాల్‌లో బంగారు పతకం కైవసం చేసుకుంది. కృష్ణవేణిని గ్రామస్తులు అభినందించారు. కాగా, తన స్థితిని వెలుగులోకి తీసుకొచ్చి దాతలు ఆర్థిక చేయూతనందించడానికి సహకరించిన 'సాక్షి'కి కృష్ణవేణి కృతజ్ఞతలు తెలిపారు.



బంగారు పతకం అందుకుంటున్న కృష్ణ వేణి